పట్టాలు తప్పిన రైలు ఇంజన్..

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలం మోటకాంపల్లి గ్రామం వద్ద సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో రైలు ఇంజన్ పట్టాలు తప్పింది. కరెంటు తనిఖీ చేసే ఇంజన్ చిత్తూరు వైపు వెళుతుండగా పట్టాలు మరమ్మతులు చేస్తుండడాన్ని గమనించకపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. అప్పటికప్పుడే సిబ్బంది వెంటనే రైలు పట్టాల మరమ్మతులు చేపట్టడంతో యధావిధిగా రైళ్ల రాకపోకలు జరిగాయి. ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

స్వర్ణరథంపై ఊరేగిన దేవదేవుడు

స్వర్ణరథంపై ఊరేగుతున్న శ్రీవారు

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం సాయంత్రం 4 గంటలకు శ్రీవారు బంగారు తేరులో విహరిస్తూ, భక్తుల్ని తన కృపాకటాక్షాలతో అనుగ్రహించారు. దాసభక్తుల నృత్యాలతోను, భజనబృందాల కోలాహలం, మంగళ వాయిద్యాల నడుమ తిరు మాడవీధులలో కడురమణీయంగా స్వర్ణరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీవారి స్వర్ణరథాన్ని లాగారు. స్వర్ణ రథోత్సవంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హనుమంత వాహన సేవలో అలరించిన నృత్య, కళా ప్రదర్శనలు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం ఉదయం నిర్వహించిన హనుమంత వాహనసేవలో దేశం నలుమూలల నుండి విచ్చేసిన ప్రసిద్ధ కళాబృందాలు తమ అద్భుతమైన ప్రదర్శనలతో వాహనసేవకు ఆధ్యాత్మిక శోభను, విశేషమైన కళాత్మకతను తీసుకొచ్చాయి. మొత్తం 26 కళాబృందాలు పాల్గొన్నాయి. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 607 మంది కళాకారులు తమ ప్రదర్శనలను ఇచ్చారు. దేశంలోని 18 రాష్ట్రాల నుండి బృందాలు ఈ సేవలో భాగమయ్యాయి. కేరళ, తమిళనాడు, కర్ణాటక, హర్యానా, ఛత్తీస్‌గఢ్, గోవా, తెలంగాణ, ఒడిస్సా, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, బీహార్, మణిపూర్, పంజాబ్, జమ్ము కాశ్మీర్ వంటి 15కు పైగా రాష్ట్రాల నుంచి వచ్చిన ఈ సాంప్రదాయ నృత్యాలు, ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. కేరళ నుంచి వచ్చిన యక్షగానం (నవదుర్గ), తమిళనాడు నుంచి పాండిచ్చేరి ఫోక్ డాన్స్, మైలట్టం, కర్ణాటక నుంచి పిన్నాల్ ఆండాళ్ డాన్స్ వంటి సాంప్రదాయ నృత్యాలు ఆయా ప్రాంతాల సంస్కృతిని, వైవిధ్యతను కళ్లకు కట్టాయి. తెలంగాణ బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఉల్లాసపరిచింది. మహారాష్ట్ర నుంచి గొందళ్ నృత్యం, శక్తివంతమైన డ్రమ్ముల విన్యాసాలు ప్రేక్షకులకు ఉత్తేజాన్నిచ్చాయి. గోవా కల్చరల్ డిపార్ట్‌మెంట్ సమర్పించిన గోవా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీరామ పట్టాభిషేకం, రామావతారం వంటి పౌరాణిక ఘట్టాలను కళాకారులు తమ నృత్య రూపకాల ద్వారా అద్భుతంగా ప్రదర్శించి, భక్తి భావాన్ని పెంపొందించారు.

గరుడసేవ విజయవంతమైనందుకు

టిటిడికి ముఖ్యమంత్రి అభినందనలు

అత్యంత విశిష్టమైన తిరుమల శ్రీవారి గరుడ వాహన సేవను అద్భుతంగా నిర్వహించినందుకు టీటీడీ, జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. తన అధికారిక ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ల ద్వారా ముఖ్యమంత్రి స్పందించారు. ఈ పవిత్ర గరుడ వాహన సేవలో పాల్గొనేందుకు దేశ విదేశాల నుండి తరలివచ్చిన 3 లక్షల మందికిపైగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారికి అపూర్వమైన అనుభూతిని అందించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన టీటీడీ పాలకమండలి, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, జిల్లా అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, తిరుమల కొండ పవిత్రతను కాపాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తి పరవశంతో పాల్గొని తరించిన భక్త కోటికి ధన్యవాదాలు తెలిపారు.

గజ వాహనంపై శ్రీ మలయప్ప కనువిందు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీ మలయప్ప స్వామివారు గజవాహనంపై దర్శనమిచ్చారు. మాడవీధుల్లో అంగరంగ వైభవంగా జరిగిన వాహనసేవలో వివిధ కళాబృందాల ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని వాహనసేవలో దర్శించుకున్నారు. వాహన సేవలో ప్రత్యేక ఆకర్షణగా శ్రీవారి గజాలు శ్రీవారి ఆలయ గజాలు మహాలక్ష్మి, పద్మజ, పద్మావతి, వైష్ణవి నేతృత్వంతో మలయప్ప వాహన సేవల వైభవాన్ని పెంచాయి. రంగురంగుల అలంకారాలతో గజవాహనం ముందు శరవేగంగా కదులుతూ భక్తులకు కనువిందు చేశాయి. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



హనుమంత వాహనంపై శ్రీమలయప్ప స్వామివారు

వృద్ధురాలిపై ఒంటరి ఏనుగు దాడి

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం సరిహద్దులోని తమిళనాడు రాష్ట్రం బసవన్న కోయిల్ సమీపంలో వ్యవసాయ పొలం వద్దనున్న వృద్ధురాలిపై ఒంటరి ఏనుగు దాడి చేసింది. మారికుప్పంకు చెందిన మారెమ్మ (70) వ్యవసాయ పొలం వద్ద ఉండగా ఒంటరి ఏనుగు దాడి చేసింది. ఏనుగు దాడిలో మారెమ్మ ఎడమ చేయి రెండు ముక్కలు కాగా తీవ్రంగా గాయపడ్డ వృద్ధురాలిని చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుప్పం మండలం నడుమూరు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఆరు ఏనుగుల గుంపు నుండి విడిపోయిన ఒంటరి ఏనుగు మారెమ్మపై దాడి చేసినట్లు తమిళ అటవీ అధికారులు భావిస్తున్నారు. ఆంధ్ర - తమిళనాడు సరిహద్దులో ఏనుగుల గుంపు సంచరిస్తున్న నేపథ్యంలో అడవి సరిహద్దు గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్ పేర్కొన్నారు. ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు అటవీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారన్నారు.

ఒంటరి ఏనుగు దాడిలో గాయపడిన మారెమ్మ

జర్నలిస్టులపై అక్రమ కేసు రద్దు చేయాలి

ఏపీడబ్ల్యూజేఎఫ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చంద్రగిరి నియోజకవర్గంలోని చంద్రగిరి ఆంధ్రజ్యోతి దినపత్రిక రిపోర్టర్ లీలాకృష్ణ, టివి 9 రిపోర్టర్ సురేష్, బిగ్ టీవీ రిపోర్టర్ శంకర్‌లపై రామచంద్రపురం పోలీసులు పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఉపసంహరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు బి.ప్రకాష్ ప్రధాన కార్యదర్శి సలీం, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చల్లా జయచంద్ర, ప్రధాన కార్యదర్శి నీరజాక్షులు, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఏ.కేశవులు, బాలసుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రామచంద్రపురంలోని లీలాకృష్ణ తాతలనాటి ఆస్తికి పాసుబుక్ మంజూరు చేయాలని, ఆన్ లైన్‌లో నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారని, వారి ఆస్తి తగాదోల్లో ఉందని రెవెన్యూ అధికారులు కాలయాపన చేశారని తెలిపారు. లీలాకృష్ణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ కార్యాలయానికి రమ్మని తహశీల్దార్ పిలిపించారని, ఇంతలో నాటకీయంగా లీలాకృష్ణ, సురేష్, శంకర్‌లు తనను దూషించాడని ఆర్ఐ లక్ష్మీనారాయణ, తహశీల్దార్ మధుసుదన్ రావుకు ఫిర్యాదు చేశారని, ఈఘటనపై విచారణ జరిపిన తహశీల్దార్ పోలీసులను కోరారని అయితే రాజకీయ ఒత్తిళ్లతో అత్యుత్సాహం ప్రదర్శించిన రామచంద్రాపురం పోలీసులు ఏకంగా లీలాకృష్ణ, సురేష్, శంకర్‌లపై పోలీస్ కేసు నమోదు చేశారని తెలిపారు. న్యాయం అడిగిన రిపోర్టర్ లీలాకృష్ణ, సురేష్, శంకర్‌లపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఫెడరేషన్ ఖండిస్తోందని, బేషరతుగా పోలీస్ కేసు ఉపసంహరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉద్యమం నిర్వహిస్తుందని హెచ్చరించారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి: కడ పీడీ

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కడ పీడీ వికాస్ మర్మత్

ప్రజాశక్తి-కుప్పం: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కడ పీడీ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గానికి సంబంధించి వివిధ సమస్యల గాను 19అర్జీలు సమర్పించారు. ప్రజల నుండి వచ్చిన ఆర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపినట్లు పీడీ తెలిపారు. ప్రజలు అర్జీల రూపంలో ఇచ్చిన సమస్యలు పరిష్కారం కాకపోతే ఎందుకు పరిష్కారం కాలేదన్నది అర్జీదారులకు తెలియజేయాలని కడ పిడి వికాస్ మరమ్మత్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈలు గురువారెడ్డి, పురుషోత్తం, తహశీల్దార్ చిట్టిబాబు, అధికారులు పాల్గొన్నారు.

కుప్పం రెస్కోలో ప్రక్షాళన

- సూర్య ఘర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి
- రెస్కో సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో)కు మళ్లీ పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేపడుతామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం రెస్కో సర్వసభ్య సమావేశంను సోమవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించారు. రెస్కో పరిధిలో నెలకొన్న అనేక సమస్యలను రైతులు వినియోగదారులు ఈ సందర్భంగా లేవనెత్తారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు నింపేందుకు రాష్ట్రంలో 14 రెస్కోలను స్థాపించగా నేడు కుప్పం రెస్కో మాత్రమే కొనసాగుతుందని ఇలాంటి సంస్థను కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. రెస్కో పరిధిలో గతంలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రస్తుత కమిటీ పూర్తిస్థాయిలో చర్యలు తీసుకునేందుకు నిష్పక్షపాతంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. కుప్పం రెస్కోకు మళ్ళీ పూర్వవైభవం తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. దేశంలో కోటి గృహాలకు సూర్య ఘర్ అందించాలని ప్రధాని మోడీ సంకల్పించారని సూర్య ఘర్ పట్ల ప్రజలకు వరింత అవగాహన కల్పించేందుకు రెస్కో పాలకమండలి నిరంతరం కృషి చేయాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో రానున్న మూడు నెలల్లో 40 వేల గృహాలకు సూర్య ఘర్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. రెస్కో మాజీ చైర్మన్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం మాట్లాడుతూ రెస్కో చైర్మన్‌గా తాను పనిచేసినప్పుడు ఉద్యోగాలు ఇవ్వలేదని తనను పార్టీ శ్రేణులు విల్లన్ గా చూశారని, సంస్థకు అవసరమైన మేరకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలే తప్ప విచ్చలవిడిగా ఉద్యోగాలు ఇస్తే సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీని రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు 1200 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందని మరో రెండు మూడు నెలల్లో పనులు ప్రారంభమవుతుందన్నారు. కుప్పం రెస్కో మనందరి సంస్థ అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని రెస్కో చైర్మన్ ప్రతాప్ పేర్కొన్నారు. గతంలో రెస్కో పరిధిలో అవసరం ఉన్నచోట ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా అవసరానికి మించి ఉద్యోగ నియామకాలు చేపట్టారని విచారణ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రెస్కో ప్రక్షాళనకు త్వరలోనే చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మార్కెట్ కమిటీ మునిరాజు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, జనసేననేత నరేష్, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్,రెస్కో డైరెక్టర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అలసత్వం చేయకండి.. కలెక్టర్

పిజిఆర్ఎస్‌కు 292 వినతులు

చిత్తూరు అర్బన్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్స్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన 292 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజల నుంచి అర్జీ స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డిప్యూటీ కలెక్టర్ కుసుమ కుమారి, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితులో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారు సంతృప్తి చెందేలా వేగంగా పరిష్కరించినప్పుడే అధికారులపై విశ్వాసం కలుగుతుందన్నారు. మొత్తం 292 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించి 204, జిల్లా పరిషత్ 1, పోలీస్ శాఖ 6, పంచాయతీరాజ్ 5, దేవదాయ శాఖ 2, వ్యవసాయ శాఖ 3, విద్యాశాఖ 5, రిజిస్ట్రేషన్, స్టాంపులు 4, పౌరసరఫరాల శాఖ 5, డిఆర్‌డిఏ 28, ఇరిగేషన్ 2, విద్యుత్ శాఖ 3, సర్వశిక్ష అభియాన్ 3, పశు సంవర్ధక శాఖ 12, గృహ నిర్మాణ సంస్థ 3, ఉద్యాన శాఖ 2, రహదారులు, భవనాల శాఖ 1, ఎంప్లాయిమెంట్ శాఖ 2, ఎంపీడీవో గంగవరం 1.

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించండి..: ఎస్పీ

చిత్తూరు అర్బన్ : జిల్లా ఎస్పీ పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి 41 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా, వాటిని సమర్థవంతంగా పరిష్కరించాలని డీఎస్పీ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులు జిల్లా నలుమూలల నుంచి వచ్చి, డీఎస్పీ గని, చిత్తూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర, చిత్తూరు వెస్ట్‌సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ నాయుడుని కలిసి తమ సమస్యలను వినిపించారు. ఫిర్యాదులకు స్పందిస్తూ, బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అందిన ఫిర్యాదులన్నింటిపై చట్టపరమైన విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా సమస్యలు పరిష్కరించాలంటూ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 41 ఫిర్యాదులు అందాయి. చీటింగ్ 1, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 7, ఇంటి తగాదాలు 1, భర్త వేధింపులు 3, భూ తగాదాలు 8, డబ్బు తగాదాలు 8, చిన్న తగాదాలు 1, ఆస్తి తగాదాలు 7, దారి తగాదాలు 1.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

త్వరగా సమస్యలు పరిష్కరించాలి : కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. నగరపాలక పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించి పరిష్కరించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయి విచారణ చేసి సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో అందే ప్రతి ఫిర్యాదుపై తప్పనిసరిగా క్షేత్రస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలన్నారు. గతవారం అందిన వినతులపై సమీక్షించారు. సోమవారం కార్యక్రమంలో పింఛన్లు 1, ఇంజనీరింగ్ 4, టౌన్ ప్లానింగ్ 1 చొప్పున మొత్తంగా ఆరు వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకటరామి రెడ్డి పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

దళిత మహిళకు న్యాయం చేయాలి

- కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్ ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గంగవరం మండలం బూడిదిపల్లి దళిత మహిళ మనెమ్మకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ధర్నానుద్దేశించి సీపీఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్యలు మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి అనుభవంలో వున్న రేకుల షెడ్‌ను ప్రైవేట్ వాహనంతో అక్రమంగా తొలగించడం దారుణమన్నారు. గ్రామానికి తోట పనిచేస్తూ జీవించే నరసింహులు కుటుంబం తోట పనిచేయలేమని చెప్పడంతో గ్రామస్తులు అప్పటినుండి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులను పదేపదే కలిసి న్యాయం చేయాలని అడిగిన పేదలపై కనికరం చూడకుండా వాళ్ళ అనుభవంలో ఉన్న షెడ్డును దౌర్జన్యంగా తొలగించడం దారుణమన్నారు. రెవెన్యూ అధికారులు వారున్న స్థలానికి బదులు ఇంకొక స్థలం ఇస్తామని చెప్పినప్పటికీ స్థలం చూపించకుండానే వారు నివసిస్తున్న షెడ్డును తొలగించడం బాధాకరమన్నారు. జిల్లా కలెక్టర్ చెప్పినప్పటికీ స్థానిక అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు అధికారులు వ్యవహరించడం, పేద దళిత కుటుంబానికి న్యాయం చేయకుండా గ్రామస్తులు పెత్తందారులు చెప్పినట్లు వినడం ప్రజాస్వామ్య విరుద్ధంగా అధికారులు వ్యవహరించడం సరైంది కాదన్నారు. పోలీసులు, అధికారులు ముందే మహిళ మీద దౌర్జన్యం చేస్తున్న పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. దళిత కుటుంబం అయినా తమకు చేయాలని అధికారుల ముందే మునెమ్మ యాసిడ్ తాగి చావే శరణ్యం అని తాగినా వారించకుండా ఆసుపత్రికి కూడా తీసుకుపోవడం అత్యంత దారుణమన్నారు. వెంటనే వారి కుటుంబానికి న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వారంలో సమస్య పరిష్కరిస్తా.. కలెక్టర్ హామీ

ధర్నా అనంతరం కలెక్టర్‌ను కలిసి బాధితులు సమస్యను వివరించగా కలెక్టర్ వెంటనే ఆర్డీవోకి ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యను వారంలోపు సమస్య పరిష్కరించాలని, లేకుంటే తానే స్వయంగా వచ్చి సమస్య పరిష్కారం చేస్తానని, బాధితులకు న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, కెవిపిఎస్ నాయకులు పాదం సుబ్రహ్మణ్యం, పాకాల సుబ్రహ్మణ్యం, ఎస్డిఎప్ పార్టీ జిల్లా అధ్యక్షుడు యూసఫ్, ప్రజాసంఘాల నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

స్వచ్ఛ సర్వేక్షన్‌లో పుంగనూరు 7వ ర్యాంక్

ప్రజాశక్తి- పుంగనూరు: వర్షాకాలం వస్తుందని ప్రధాన మురుగునీటి కాలువలలో షిల్ట్ తీయించాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాష శానిటరీ అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సాధారణ సమావేశం సమావేశ హాల్‌లో సోమవారం ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. అజెండాలోని ఆరు అంశాలను చదివి వినిపించగా కౌన్సిల్ సభ్యులందరూ అజెండాను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నామని కౌన్సిలర్ నటరాజ చెప్పారు. చైర్మన్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు 7వ వార్డులోని మసీదు వీధి, అబ్బ చిన్నబ్బ వీధి వర్షపు నీరు ఇళ్లల్లోకి రావడం జరిగిందన్నారు. ఇక్కడున్న సమస్యలు శాశ్వతంగా పరిష్కరించేందుకు రాజంపేట ఎంపీ నిధుల నుంచి 20 లక్షలు మంజూరు చేశారని పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కమిషనర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా పుంగనూరు మున్సిపాలిటీకి రేటింగ్‌లో ఏడవ స్థానం దక్కిందన్నారు. గుడివాడ, నెల్లూరు, విజయనగరం, పుంగునూరులకు రేటింగ్‌లో ఏడో స్థానం రాగా జిల్లాలో మొదటి స్థానం వచ్చిందన్నారు. పికెఎం నిధులు 45 లక్షలు మంజూరు అయిందని దీంతో రాంనగర్, భగత్‌సింగ్ కాలనీ, సూర్యనగర్‌లో కాలువల పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే ఎన్జీవో కాలనీలో అవుట్ లెట్ డ్రైన్, ప్రధాన కాలువ నిర్మాణానికి 70 లక్షల మంజూరు అయిందని చెప్పారు. టెండర్ల ద్వారా పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. పట్టణంలోని పాలకవర్గం, ప్రజల సహకారంతోనే స్వచ్ఛ సర్వేక్షన్‌లో జిల్లాలోని మొదటి స్థానం వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు కొండవీటి నాగేంద్ర, సిఆర్.లలిత, కౌన్సిలర్లు, మున్సిపల్ డీఈ మహేష్, ఆర్ఐ, టిపిఓ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్ బాష

భూకబ్జాలకు అడ్డుకట్ట వేయండి: సిపిఎం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో రోజురోజుకి భూకబ్జాలు ఎక్కువ అవుతున్నాయని వాటిని అరికట్టాలని సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో చిత్తూరు, జిడి నెల్లూరు, పూతలపట్టు, గంగవరం, పెద్దపంజాణి, ఎస్ఆర్ పురం, వి కోట, బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, యాదమరి తదితర మండలాల్లో భూకబ్జాలు అధికమయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వంలో కూడా ఇదే వ్యవహారం పేదల భూములను ఆక్రమించుకోవడం జరిగిందని, ప్రజాగ్రహంతో ఆ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నికల తర్వాత భూసమస్య తీవ్రంగా అయ్యిందన్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యలకు పరిష్కరించడానికి కొంత ప్రయత్నం చేస్తున్నప్పటికీ తహశీల్దార్ కిందస్థాయి నుండి ఏమాత్రం లెక్క చేయకుండా పేదలకు ఇబ్బందులు గురిచేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతూ పేదలకు అన్యాయం చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలకు ఒక సెంటు భూమి అడిగితే లేదని చెప్పే రెవెన్యూ అధికారులు ఎకరాలు ఎకరాలు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుంటున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదల అనుభవంలో ఉన్న భూములకు పట్టాలిచ్చి పేదలకు రక్షణ కల్పించాలని కోరారు.

ప్రజా ప్రతినిధులు అంటే లెక్క లేదా?

ప్రజాశక్తి- యాదమరి: 'ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు అంటే యాదమరి మండల అధికారులకు లెక్క లేకుండా పోయింది..!' అంటూ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సురేష్ బాబు కొంతమంది అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సురేష్ బాబు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పటి నుండి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపడుతున్న ఎలాంటి కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదంటూ, ప్రజా ప్రతినిధులు అంటే లెక్క లేకుండా పోయిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'యాదమరి మండలానికి 300 బస్తాలు యూరియా వస్తే యూరియా ఏమైంది?' అగ్రికల్చర్ అధికారిణి నిలదీశారు. రైతులకు అందించాల్సిన ఎరువులను సైతం అగ్రికల్చర్ అధికారులు, అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే ఇస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ యాదమరి మండలానికి ప్రభుత్వం సబ్సిడీతో అందించే అంతర పంటల విత్తనాలు జొన్నలు, మొక్కజొన్నలు వచ్చి నెల రోజులైనా ఇంతవరకు ప్రజా ప్రజా ప్రతినిధులకు, గ్రామ సచివాలయం సిబ్బంది, అగ్రికల్చర్ అధికారులు ఎందుకు సమాచారం ఇవ్వలేదని నిలదీశారు. తహశీల్దారు పార్థసారథి జోక్యం చేసుకొని రైతులు అందించిన వివరాలు అందించాలన్నారు. కాశిరాళ్ల ఎంపీటీసీ దుర్వాసులు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా గాంధీపురం గ్రామానికి తాగునీరు బోరుకు విద్యుత్ సౌకర్యం పనులు చేపట్టాలని జిల్లా పరిషత్ నిధుల నుండి మూడు లక్షలు చెల్లించి ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు విద్యుత్ శాఖ అధికారులు పనులు చేపట్టలేదని నిలదీశారు. కసిరాల సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇన్‌ఛార్జి ఉండడంతో సచివాలయానికి సక్రమంగా రావడం లేదని, దసరా పల్లి సచివాలయంలో సిబ్బంది కొరత ఉందని పరిష్కరించాలని అధికారుల దృష్టికి సర్పంచులు తీసుకెళ్లారు. తెల్ల రాళ్లపల్లి సర్పంచ్ బజలింగం మాట్లాడుతూ డీకే చెరువు గ్రామానికి బస్సు సక్రమంగా రావడం లేదని రోడ్డు వేశారని బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీలో చేపట్టిన గోకులం షెడ్ల బిల్లులు ఎప్పుడు వస్తాయంటూ ఏపీవోను నిలదీశారు. ఏపీఓ సంధ్యారాణి మాట్లాడుతూ గోకులం షెడ్ లో పెండింగ్ బిల్లులు ప్రభుత్వం విడుదలైన వెంటనే వారి ఖాతాలకు జమవుతాయని తెలిపారు. ఉపాధి జాబ్ కార్డ్ కలిగిన ప్రతి శ్రామికులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని, అలా చేసుకున్న వారికి మాత్రమే ఉపాధి బిల్లులు చెల్లిస్తారన్నారు. వ్యవసాయ భూములు కలిగిన రైతులకు వారికి కావలసిన పనులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశానికి వైస్ ఎంపీపీలు హరి నారాయణ రెడ్డి, రవి, సింగిల్ విండో చైర్మన్ చిత్రానాయుడు, తహశీల్దారు పార్థసారథి, ఎంపీడీవో వీరేంద్ర, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వేణు, పిఆర్ఏఈ జయ చంద్రరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ గుర్రప్ప, ఏపిఓ సంధ్యారాణి, ఎంపీటీసీలు, సర్పంచులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- యూరియా ఏమైంది..
- వ్యవసాయ శాఖాధికారిపై ఎంపీపీ అసహనం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సురేష్‌బాబు

పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి- పూతలపట్టు: గర్భిణులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనత బారి నుంచి ఉపశమనం పొందవచ్చునని టిడిపి నాయకులు మురళి నాయుడు పేర్కొన్నారు. పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సుపోషిత్ భారత్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు పౌష్టికాహారం స్టాల్స్ ఏర్పాటు చేశారు. పలువురి పిల్లలకు అన్నప్రాసనం, సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందే పోషక ఆహారాన్ని బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకుని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపరువైజర్ భారతి, టిడిపి మండల మాజీ కన్వీనర్ చంద్రమౌళి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే ధ్యేయం..

సింగిల్ విండో ఛైర్మన్ హేమచంద్ర నాయుడు

ప్రజాశక్తి - బంగారుపాల్యం: మహిళ ఆరోగ్యం ఆ కుటుంబానికి ఆరోగ్యమని సింగిల్ విండో ఛైర్మన్ హేమచంద్ర నాయుడు పేర్కొన్నారు. మండలంలోని తగ్గువారి పల్లి పంచాయతీ లోని అంగన్ వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త రత్నకుమార్ ఆధ్వర్యంలో స్వస్తినారి సశక్తి పరివార్ సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సింగిల్ విండో చైర్మన్ హేమచంద్ర నాయుడు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం ఆ కుటుంబాన్ని ఆరోగ్యవంతులుగా మహిళ ఆరోగ్యం క్షీణించినప్పుడు కుటుంబం విచిన్నమయమై కష్టాలను ఎదుర్కొంటుందని, మహిళ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. అనంతరం ఆరోగ్యంగా ఉండేందుకు వివిధ రకాల కూరగాయలను, ఆకుకూరలు ప్రదర్శించి అందులో ఉన్న పౌష్టికాహారం శక్తి సామర్థ్యాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరువైజర్ పామీద బేగం, ఆరోగ్య సూపరువైజరు రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పి దిలీవ్, అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్య కుమారి, హేమశ్రీ, విజయ్ కుమారి, దీప పలువురు బాలింతలు గర్భిణులు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్ఆర్ పురంలో

ఎస్ఆర్ పురం : స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను ఆరిమాకులపల్లి వైద్యాధికారి డాక్టర్ బాలాజీ చరణ్ ఎస్ఆర్ పురం మండల తహశీల్దారు లోకనాథ పిల్లై ఆధ్వర్యంలో జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ నేతృత్వంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా సోమవారం ఆరిమాకులపల్లి ఆరోగ్య కేంద్రంలో ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బాలాజీ చరణ్ స్పెషలిస్ట్ డాక్టర్లతో మహిళలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ శ్రీధర్ బాబి, శ్రీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీ తేజ, డాక్టర్ స్వర్ణలత బి డి ఎస్, ఏం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ శారదా రూపంలో చౌడేశ్వరి దేవి

ప్రజాశక్తి -పుంగనూరు: మండలంలోని చదళ్ల గ్రామంలో శ్రీ సప్తమాతృక సమేత చారిత్రక శ్రీ చౌడేశ్వరి దేవి విజయదశమి ఉత్సవాలలో భాగం గా సోమవారం అమ్మ వారు చదు వుల తల్లి శ్రీ శారద గా దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆలయంలో వైదిక పూజలు ప్రారంభమయ్యాయి. వేద పారాయణం, వేదిక అర్చన, అమ్మవారికి సుగంధ తీర్థాలు, సుగంధ పుష్పాలు, సుగంధ ద్రవ్యాలు, సుగంధ ఫలాలతో అభిషేకం నిర్వహించారు. ఉత్సవాల నిర్వాహకులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఉషశ్రీ దంపతుల సమక్షంలో శ్రీ సరస్వతి దేవి మూల మంత్ర హోమాన్ని, రుద్రహోమాన్ని రుత్వికులు వైభవంగా సరస్వతీదేవి మూలమంత్ర హోమం, శ్రీ రుద్రహోమాలకు వేణుగోపాల్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, హోమ దేవతలకు ప్రీతికరమైన నైవేద్యాలతో పూర్ణాహుతి అందించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి రూపంలోనే అమ్మవారికి మహ మంగళహారతి వైభవంగా నిర్వహించారు. అనంతరం ఎన్‌విఆర్ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం వినోద కార్యక్రమాలలో రేలారే రేలా ఫేమ్ కళాకారుడు, రాష్ట్ర ప్రభుత్వ కళారత్న అవార్డు గ్రహీత దామోదర గణపతి ఆధ్వర్యంలో గొప్ప జానపద పాటలు , నృత్యాలు అలరించాయి. బృందానికి చెందిన కళాకారులను ట్రస్ట్ వ్యవస్థాపకులు వేణుగోపాల్ రెడ్డి సభ్యులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమాలలో చౌడేశ్వరి దేవి ట్రస్ట్ సభ్యులు , చదల్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బెయిల్ మంజూరుపై సంబరాలు

ప్రజాశక్తి -పుంగనూరు: రాజంపేట ఎంపీ వెంకట మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు పై పుంగనూరు పట్టణంలో వైసిపి శ్రేణుల సంబరాలు నిర్వహించారు. స్థానిక ఇందిరా సర్కిల్ వద్ద బాణా సంచాలు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి వైసిపి శ్రేణుల సోమవారం సంబరాలు చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్ మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబం పై కుటమి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా అవి తాత్కాలికమైన అని అన్నారు. అధికారమున్నదని మచ్చలేని నాయకులపై కేసులు పెడితే దీని పర్యవసరం తప్పక ఉంటుందని చెప్పారు. 71 రోజుల రిమాండ్ అనంతరం బెయిల్ పై మిథున్ రెడ్డి విడుదల అవుతున్నారు అన్నారు. ప్రైవేటు బస్టాండులో వైసిపి నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హలీం భాష, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాజేష్, సిద్ధిక్, అజ్మ, అస్లాం మురాది, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు

అనాథకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం రైల్వే స్టేషన్ వద్ద అనారోగ్యంతో మృతి చెందిన అనాథ మృతదేహానికి డీకే పల్లి మాజీ సర్పంచ్ మణి ఆధ్వర్యంలో అర్బన్ పోలీసులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తి రైల్వే ప్లాట్‌ఫాంపై కొద్ది రోజుల క్రితం మృతి చెందడంతో పోలీసులు కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే మృతుడికి సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో సోమవారం డీకే పల్లి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

సరస్వతీ దేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ

ప్రజాశక్తి-చౌడేపల్లి: శక్తి క్షేత్రం బోయ కొండ గంగమ్మ ఆలయంలో నిర్వ హిస్తున్న దసరా మహోత్సవాలలో భాగం గా సోమవా రం అమ్మవారిని సరస్వతి దేవి అలంకారంలో తీర్చిదిద్దారు. ఉదయం వేద పండితులు, అర్చకులు ఆధ్వర్యంలో విశేష అభిషేకం, సరస్వతి దేవి అలంకారం చేశారు. మూలా నక్షత్రం కావడంతో ప్రత్యేకించి సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అక్షరాభ్యాసం చేశారు. చౌడేపల్లి విజయవాణి సంస్థలు తిరుపతి వేణుగోపాల్ రెడ్డి, సుగుణ, మదనపల్లి బాలాజీ ఇండస్ట్రీస్ చౌడేపల్లి మిద్దింటి శంకరనారాయణ, రాజేశ్వరమ్మ, శిరీష, రాధాకృష్ణ, గాజుల పద్మావతమ్మ, జమున నాగరాజా, బెంగళూరు చక్రధర్, రాధిక, చిత్తూరు అనిల్ కుమార్, అనూష , బెంగళూరు కార్తీ తోని పుంగనూరు రెడ్డి రాధిక నాగేళ్ల దినేష్ చిత్తూరు వెంకట నాయుడు, సురేఖ రాణి, చిక్క మునిశెట్టి, కుటుంబ సభ్యులు సరస్వతి అలంకారానికి ఉభయ దారులుగా వ్యవహరించారు. ఉభయదారుల ఆధ్వర్యంలో యాగశాలలో వివిధ హోమాలు నిర్వహించారు అనంతరం అమ్మవారి ప్రతిమ పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

మోడ్రన్ మున్సిపాల్టీగా కుప్పం

ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం మున్సిపాల్టీగా మోడ్రన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేశామని అతి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఆర్టిసి వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి రూ.1200 కోట్ల రూపాయలతో ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేశామని మరో రెండు మూడు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. సీఎం చంద్రబాబు కుప్పం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధతోపాటు నిధులు మంజూరు చేస్తున్నారని రాజకీయాలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. మున్సిపాల్టీలో ప్రజలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన అభివృద్ధి చేస్తారని చైర్మన్ సెల్వరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గరుడునిపై లక్ష్మీ నారాయణుడు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: వేపంజేరి శ్రీ లక్ష్మీనారాయణ స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం కళ్యాణోత్సవం నిర్వహించి ఉదయం మోహిని అవతారంలో అధిరోహించిన నారాయణుడు పురవీధులలో ఊరేగారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ కెఎస్‌వాసు, అమృతవల్లి దంపతుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు . రాత్రి గరుడ వాహనంపై శ్రీలక్ష్మీ నారాయణుని అధిరోహించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తుల సౌకర్యార్థం గుడిలో మధ్యాహ్నం, రాత్రి వేళ అన్నదానం చేశారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయట్రస్టీ సతీమణి సుమిత్ర శ్రీధర్, ఆలయ మేనేజర్ వెంకటేష్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : మండలంలోని ఆరిమాకుల పల్లిలో వెలసిన శ్రీ అరిమానిగంగమ్మ దసరా ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు సోమవారం అమ్మవారు శ్రీ సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. పది రోజులు సప్లయర్స్ సామియానా దాత ముని ఆదిలక్ష్మి, భాస్కర్ నాయుడు కుమారుడు తేజో ప్రసాద్, యామని కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరిస్తున్నారు. భక్తులకు దర్శనమిచ్చి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం పుష్పయాగం నిర్వహించారు. మధ్యాహ్నం శైలజ రెడ్డి రాజారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. భాస్కర్ రెడ్డి జానకి దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు హిమాచరపతి రెడ్డి, జలంధర్ నాయుడు, వెంకటరమణ, సిద్దయ్య శెట్టి, ముని రెడ్డి ,హేమాద్రి యాదవ్ స్థానికులు జగన్నాథ నాయుడు గంధం నేని జయశంకర్ నాయుడు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ రెడ్డి, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై ఆర్పీలు, సీవోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్యదర్శులు, ఆర్పీలు, సీవోలు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలన్నారు. కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాణిజ్య పనులు శాఖ డిప్యూటీ కమిషనర్ పరదేశి నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ మహేష్ కుమార్ పాల్గొన్నారు.

యువత సన్మార్గం కోసం క్రీడల వైపు..

ప్రజాశక్తి -పుంగనూరు: యువతను సన్మార్గంలో పయనింపజేసేందుకు క్రీడల వైపు ఆకర్షితులను చేయడానికి రోటరీ క్లబ్ కృషి చేస్తోందని అధ్యక్ష, కార్యదర్శి నానుబల గణేష్, సిఎస్ రాజారెడ్డి పేర్కొన్నారు. పుంగనూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన ఏఎల్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆదివారం సాయంత్రం క్రీడల పోటీలను నిర్వహించిందన్నారు. ఈ పోటీలకు సుమారు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలలో పాల్గొన్న ప్రతి క్రీడాకారునికి సుమారు రూ.750 విలువ చేసే టీ షర్టులను అందించామన్నారు. విశేష ప్రతిభ కనబరిచిన, 30 సంవత్సరాలు 40, 50 సంవత్సరాలు పైబడిన వారికి మొదటి, రెండవ, మూడవ విజేతలుగా గుర్తించి, ట్రోఫీ, బహుమతులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రోటరీ క్లబ్ జిల్లా సెక్రటరీ మాగం హేమచంద్ర, జిల్లా అసిస్టెంట్ గవర్నర్ రామ్మోహన్ రెడ్డి, విచ్చేసి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయ్ కుమారి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరన్ కుమార్, సుధాకర్ రెడ్డి, భాస్కర జెట్టి, అనిల్ కుమార్, మునిరాజా, ఆవుల హరిప్రసాద్ , ఎస్‌విటి కిషోర్, పూల త్యాగరాజు, శివశంకర్, వేణుగోపాల్ రాజు, అర్షద్ అలీ, భాస్కర్ రెడ్డి, రవి కిషోర్ రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

వరసిద్ధుని సేవలో మాజీ ఎంపీ

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ సోమవారం దర్శించుకున్నారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి కాణిపాకం ఆలయం వద్దకు చేరుకున్న మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కి పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారి దర్శనానంతరం వేద ఆశీర్వాద మండపంలో వేద పండితులు వేదమంత్రాల నడుమ ఆశీర్వాదం అందించారు. గల్లా జయదేవ్‌ను ఎమ్మెల్యే మురళీమోహన్ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. తరువాత ఆలయ కాణిపాకం ఆలయ చరిత్ర, ప్రత్యేకతలు, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను మాజీ ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, కాణిపాకం దేవస్థానం చైర్మన్ మణినాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, తవణంపల్లె మండల మాజీ అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, నాయకులు మధుసూదన్ రావు, హేమాద్రినాయుడి, లోకనాథ నాయుడు, నరసింహాల నాయుడు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయకుని చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని పలనాడు జిల్లా పెద్దకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ భాష్యం ప్రవీణ్ కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం నూతన చైర్మన్ మణినాయుడు, సూపరింటెండెంటు వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌టిల ఆర్థికాభివృద్ధే లక్ష్యం: తహశీల్దారు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఎస్‌టిలు ఆర్థికంగా అభివృద్ధి చెందటమే ప్రభుత్వ లక్ష్యమని తహశీల్దారు శ్రీనివాసులు పేర్కొన్నారు. తూగుండ్రం పంచాయతీ, దాసరపల్లి ఎస్టీ కాలనీలో సోమవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎస్‌టి కాలనీలో సర్వే నిర్వహించి గ్యాస్ కనెక్షన్, ఇంటి పట్టాలు, పింఛన్లు, డ్వాక్రా రుణాలు, సర్టిఫికెట్ తదితర పథకాల గురించి లబ్ధిదారులను ఎంపిక చేసి లబ్ధిదారులు వివరాలు తెలిపారు. ఎస్టీ కాలనీలో తహశీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు ప్రతి ఒక్కరూ డ్వాక్రా సంఘాలలో చేరి రుణాలు పొంది ఏదైనా వ్యాపారం చేస్తే ఆదాయం పెరుగుతుందని అప్పుడు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. పిల్లలని బడికి పంపించాలని చదువుతోనే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. దాసరపల్లి ఎస్‌టి కాలనీ వాసులు తహశీల్దారుతో మాట్లాడుతూ తమ గ్రామానికి వాటర్ ట్యాంకు సౌకర్యం కల్పించాలని కోరారు. తమ గ్రామంలో గంగమ్మ గుడి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తామని తహశీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనివాసులు, ఏవో లోకేష్, ఉపాధి హామీ ఎపిఓ శ్రీనివాసులు, ఏఎస్ఐ దామోదరం, స్థానిక సర్పంచ్ శ్రీబాబు, ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ, జిల్లా టి ఎన్ టి యు సి అధికార ప్రతినిధి జీవరత్నం, బూత్ కన్వీనర్లు నరసింహనాయుడు, శంకర్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి సంపత్, టిడిపి నాయకులు రాఘవేంద్ర, దాసరపల్లి శంకర్, పంచాయతీ సెక్రటరీ శిరీష, వీఆర్వో ప్రభావతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న అధికారులు

రైతులు సకాలంలో రుణాలు చెల్లించండి

పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ చిత్రనాయుడు

ప్రజాశక్తి - యాదమరి: వ్యవసాయ సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలని సింగిల్ విండో అధ్యక్షురాలు చిత్ర నాయుడు కోరారు. యాదమరి సహకార సంఘం కేంద్రంలో సోమవారం ఉదయం 11 గంటలకు మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. సహకార సంఘం ద్వారా రైతులకు విరివిగా రుణాలు ఇస్తామని తెలిపారు. రూరల్ హౌస్ మార్టేజ్ లోన్లు మూడు లక్షలు, రూ.ఐదు లక్షల వరకు ఇస్తామని పంట రుణాల కింద రూ.ఐదు లక్షల వరకు సహకార సంఘం ద్వారా మంజూరు చేస్తామని తెలిపారు. కొత్తగా మంజూరైన మొగిలి అప్పకి మూడు లక్షల రూపాయలు, ఎం బాబు రూ.5 లక్షల రూపాయలు రుణాలు మంజూరైనట్లు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సూపరువైజరు టి ధనంజయ రెడ్డి పాల్గొన్నారు. పాలకవర్గ సభ్యులు మహబూబ్ బాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు హరిప్రసాద్ నాయుడు, జ్యోతి మోహన్, సంఘ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్ గుణశేఖం, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింగిల్ విండో అధ్యక్షురాలు చిత్రనాయుడు

ప్రాథమిక వైద్యుల సమ్మె

ప్రజాశక్తి బంగారుపాళ్యం: ప్రాథమిక వైద్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సోమవారం మండలంలోని తుంబకుప్పం ప్రాథమిక వైద్య కేంద్రంలో సమ్మెబాట పట్టారు. ఓపి సేవలను బహిష్కరించినట్లు అత్యవసర పరిస్థితిలో చికిత్సలు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ గత సంవత్సరం ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నేటివరకు అమలు కాలేదని దానికి విరుద్ధంగా చర్యలు తీసుకున్నారని ఈ నేపథ్యంలో చేపట్టిన నిరసనలో భాగంగా సోమవారం నుంచి ఔటేపేషెంట్ లను నిలిపివేస్తున్నామని వారు పేర్కొన్నారు. గత 20- 25 సంవత్సరాల నుంచి ఉద్యోగోన్నతులు లేక ఒకే హోదాలో సేవలందిస్తున్న వైద్యాధికారులకు న్యాయం కాలేదని ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని జి.ఓ 99 రద్దు చేయాలని కోరారు. కోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరు చేయాలని గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం గిరిజన భత్యంగా మంజూరు చేయాలని సూచించారు. చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.ఐదువేలు భత్యం మంజూరు వంటి సమస్యల పరిష్కారానికి సమ్మెబాట పట్టామని వైద్యులు రమేష్ తెలిపారు.

గ్రామబహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: యాదమరి మండలం బుడితి రెడ్డిపల్లి ముస్లిం వాడలో మూడు ముస్లిం కుటుంబాలను మూడు సంవత్సరాలగా బహిష్కరణ చేసిన వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని తీసుకొని ఆ కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ బుడితిరెడ్డిపల్లి యాదమరి మండలం గుడితి రెడ్డిపల్లి బుడితి రెడ్డిపల్లి ముస్లిం వాడలో ఒక కుటుంబంలో ఒక మహిళ పెళ్లి చేసుకున్నారని నేపంతో మూడు సంవత్సరాలుగా ఆ గ్రామ ముఖ్యులు ఆ మూడు కుటుంబాలను బహిష్కరించి వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించకూడదని షరతులు విధించిన వారిపై చట్ట ప్రకారంగా తగిన చర్యలు తీసుకొని మూడు కుటుంబాలు మూడు సంవత్సరాలుగా బహిష్కరించి వేధిస్తున్న వారిపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ పరిధిలో వైద్యసేవల నిమిత్తం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ద్వారా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రూ.31,07,162లు సాయం అందించారు. సోమవారం చిత్తూరులోని గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 27 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

పలమనేరులో డిప్యూటీ సీఎం పీఏ

చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్న క్షణాలు

ప్రజాశక్తి-పలమనేరు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్సనల్ సెక్రటరీగా సేవలందిస్తున్న మధుసూదన్ సోమవారం పలమనేరును సందర్శించిన సందర్భంగా గంగవరం మండలం కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పలమనేరులో తాను చదువుకున్న ఆదర్శ పాఠశాలను సందర్శించి తన పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తనకు చదువు చెప్పిన టీచర్లను గుర్తు చేసుకుంటూ విద్యార్థులతో మధుసూదన్ మాట్లాడు తూ జీవితంలో ఎంత ఎత్తుకెళ్లినా తన విద్యాసంస్థ పట్ల గౌరవం ఎప్పుడూ మరిచి పోవద్దని సూచించారు. ప్రస్తుత విద్యార్థులకు ప్రోత్సాహకరమైన మాటలు మాట్లాడుతూ కష్టపడితే ఎవరైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ప్రేరణ నింపారు. ఈ సందర్శనతో స్కూలు వాతావరణం ఆనందంగా మారింది. పూర్వ విద్యార్థి ఇలాంటి ఉన్నత స్థాయికి చేరుకొని తిరిగి వచ్చినందుకు స్కూలు సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

సీఎంతోనే స్వర్ణకుప్పం సాధ్యం: ఎమ్మెల్సీ

రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -శాంతిపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే స్వర్ణ కుప్పం సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీ ఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం అన్నారు. పెద్ద బొమ్మనపల్లి గ్రామానికి నూతనం గా మంజూరైన రోడ్డు నిర్మాణా నికి సోమవారం వారు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కుప్పం నియో జక వర్గం స్వర్ణ కుప్పం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. 2029 నాటికి అభివృద్ధి పనులను పూర్తి చేసి స్వర్ణ కుప్పం సాధిస్తారన్నారు. అందులో భాగంగానే రూ.41 లక్షలతో కుప్పం పలమనేరు జాతీయ రహదారి నుండి పెద్ద బొమ్మనపల్లి గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలకే సుమారు రూ.2,800 ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. మరింత ఖర్చు చేసి అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయ్ కుమార్, మాజీ అధ్యక్షులు విజయరామిరెడ్డి, రాళ్ల బుదురు మాజీ క్లాస్ సరి ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, డైరెక్టర్ అనసూయ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు యూనిట్ ఇన్‌ఛార్జిలు ఆర్ఎస్ మణి, కడ సభ్యురాలు సుగుణమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

దోబీ ఘాట్ ఆక్రమణపై ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -రొంపిచర్ల: దోబీఘాట్ ఆక్రమణపై పోలీసు స్టేషన్ ఎస హెచ్ వో చంద్రశేఖర్‌కు స్థానికులు సోమవారం ఫిర్యాదు చేశారు. రొంపిచర్ల మండలం నగిరిమడుగు వారి పల్లి వద్ద సర్వేనెంబర్ 1041 లో 0.40 సెంట్లు దోబీ ఘాట్ కోసం ప్రభుత్వం మంజూరు చేసి విద్యుత్తు సర్వీస్, బోరు మోటారు, తొట్టెలు కట్టి రజకులకు ఇచ్చారు. దోబీ ఘాట్ స్థలంలో గ్రామస్తులు పేడ దిబ్బలు, గడ్డివాములు, పశువుల కొట్టాలు వేసుకొని ఆక్రమించుకున్నారు. గతంలో ఇదే విషయమై రొంపిచర్ల తహశీల్దారు అమరనాథ్‌కు విన్నవించుకోగా సోమవారం సర్వేయర్‌ను పంపి హద్దులు సర్వే చేసి కూసాలు నాటుతుండగా గ్రామంలోని గిరి, అతని సంబంధీకులు 30 మంది వచ్చి అడుపడ్డారు. ఈ సమస్యపై రొంపిచర్ల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో బాధితులు రజక సంఘం అధ్యక్షులు గుర్రప్ప, ప్రతాప్, హరినాథ్, నిర్మల, జయ ప్రకాష్, అనురాధ, నాగభూషణం కలిసి ఫిర్యాదు చేశారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని తహశీల్దారు లోకనాథపిల్లై అధికారులను ఆదేశించారు. ఎస్ఆర్‌పురం తహశీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పొజిషన్ సర్టిఫికెట్‌కు ఇద్దరు, బర్త్, డెత్ సర్టిఫికెట్‌కు ముగ్గురు, ముటేషన్‌కు ఇద్దరు, రేషన్ కార్డ్‌కు ముగ్గురు, ఇంటి స్థలం కోసం ఇద్దరు, పొజిషన్ సర్టిఫికెట్‌కు ఇద్దరు, దారి సమస్యలపై ఇద్దరు అర్జీలతో కలిసి మొత్తం 14 అర్జీలు స్పందనలో వచ్చాయని తహశీల్దారు లోకనాథ పిల్లై పేర్కొన్నారు. అందులో ఐదు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యాయి. మిగిలినవి దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ నైపుణ్యాలు అవసరం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : ఏఐ ఆధారిత కమ్యూనికేషన్ నైపుణ్యాలు విద్యార్థులకు అవసరమని నగరి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐ సాధనాల మద్దతుతో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచడంలో సహాయపడటానికి 'బ్రిడ్జ్ ది గ్యాప్: కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ ది ఎనేబుల్ వరల్ పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఇంగ్లీష్ విభాగం అధ్యాపకులు రేవతి, పంకజలను ప్రశంసించారు. విద్యార్థులు మానవ, ఏఐ ఆధారిత కమ్యూనికేషన్ నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఏఐ ఆధారిత నైపుణ్యంపై విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, స్పష్టత, ఏఐ ఆధారిత టూల్స్ వినియోగంలో విలువైన అనుభవాన్ని అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో జేకేసీ మెంటార్ లాల్ భాష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్‌టీ వివరాలు ప్రదర్శించాలి

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : వ్యాపారవేత్తలు తగ్గిన జీఎస్టీని చూపే విధంగా బోర్డు రూపంలో గానీ, పోస్టర్ రూపంలో గానీ తమ షాపు వద్ద ప్రదర్శనగా ఉంచాలని మున్సిప ల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం నందు జీఎస్టీ 2.0పై అవగాహన ఏర్పరిచేవిధంగా డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పూర్ణం ఆధ్వర్యంలో వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం నుండి ఓంశక్తి గుడి వరకు గల ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి, ఓంశక్తి ఆలయం వద్ద మానవహారం చేపట్టారు. ఈ ర్యాలీలో పురపాలక సిబ్బంది, నగరి పట్టణ వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఐవోసీఎల్ రిటైల్ అవుట్ లెట్‌కు భూమి పూజ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలో, కేంద్రంలోని కూటమి ప్రభుత్వాలు మహిళా పక్షపాతులని, మహిళల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లి కూరగాయల మార్కెట్ వద్ద చిత్తూరు నగర పాలక సంస్థ, ఐవోసీఎల్ రిటైల్ అవుట్ లెట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.